ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 Global

https://epaper.eyyaltynews.in/

శుక్రవారం 18 సెప్టెంబర్ 2026


## 22ఏ భూములకు గుడ్ న్యూస్..

### జల్దీగా సాల్వ్ చేస్తామంటున్న సర్కార్!




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

22ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న భూ యజమానులకు పరిష్కారం చూపేందుకు ముగ్గురు సభ్యులతో హై-లెవల్ కమిటీ ఏర్పాటు చేసింది. సీసీఎల్ఏ కమిషనర్ చైర్మన్‌గా, లా సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ సభ్యులుగా ఉంటారు. 118 జీవో బాధితుల సమస్యలపైనా కమిటీ ఫోకస్ పెట్టనుంది. నెల రోజుల్లో సమస్యలను సాల్వ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. 22ఏ నుంచి అర్హత ఉన్న భూములను లిఫ్ట్ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.



## నల్లకుంటలో కాలేరు బస్తీ బాట.. సమస్యలపై ఫుల్ ఫోకస్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18:**

నల్లకుంట డివిజన్ వెంకటేశ్వర్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పర్యటించి స్థానికుల గోస విన్నడు. అధికారులతో కలిసి కాలనీలో తిరిగి డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించిండు. పెండింగ్ పనులు, కొత్త రోడ్ల నిర్మాణంపై అధికారులతో ముచ్చటించి.. జనాలకు ఇబ్బంది లేకుండా సమస్యలను జల్దీగా సాల్వ్ చేయాలని ఆదేశించిండు. అభివృద్ధి పనుల్లో లేట్ చేస్తే నడవదంటూ అధికారులకు క్లియర్‌గా చెప్పిన ఎమ్మెల్యే.. ప్రజల సమస్యల పరిష్కారమే ఫస్ట్ ప్రయారిటీ అని తేల్చి చెప్పిండు.

## ముఠా గోపాల్‌కు కాలేరు పరామర్శ... జల్దీగా కోలుకోవాలంటూ దువా!



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18:**

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మోకాలి ఆపరేషన్ అనంతరం రెస్ట్ తీసుకుంటున్న విషయం తెలుసుకున్న అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ముఠా గోపాల్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో యాక్టివ్‌గా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆకాంక్షించిండు

## దానంపై అనర్హత వేటు.. ప్రజాస్వామ్యానికి 'విక్టరీ' : మల్లికార్జున్ యాదవ్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18**




: 2023లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచిన దానం నాగేందర్.. ప్రజల తీర్పును, తనకు అవకాశం ఇచ్చిన పార్టీని విస్మరించి కాంగ్రెస్‌లో చేరారని బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ విమర్శించారు. అనంతరం సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారని తెలిపారు. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనమని అన్నారు. పార్టీ మారే ప్రజాప్రతినిధులకు ఇదొక ముఖ్యమైన సందేశమని పేర్కొంటూ.. ప్రజల ఓట్లతో గెలిచిన నేతలు జనాల తీర్పుకు, రాజ్యాంగ నిబంధనలకు జవాబుదారీగా ఉండాలన్నారు.




# ఫిరాయింపు ఘటాఘట్..

# దానం సీటు ఖాళీ!

- బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపు..
- కాంగ్రెస్‌లో చేరిక..
- సికింద్రాబాద్ బరిలో పోటీ..
- చివరకు కోర్టు తీర్పుతో ఖాళీ!
- ఖైరతాబాద్‌లో బైపోల్ బజ్జర్..
- పార్టీ మారితే.. సీటు పోతదా?
- హైకోర్టు తీర్పుతో కొత్త చర్చ!
- ఖైరతాబాద్ పాలిటిక్స్‌లో కొత్త ట్విస్ట్..
- ఇక బైపోల్ కోసం పార్టీల కసరత్తు!
- ఫిరాయింపు ఎమ్మెల్యేల
- యవ్వారంపైనా పొలిటికల్ హీట్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18: ఖైరతాబాద్ పాలిటిక్స్‌లో ఇయ్యాల మస్త్ ట్విస్ట్.. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ గతంలో ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన కోర్టు.. దానం నాగేందర్ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లయింది.**

**కోర్టు తీర్పుతో ఖైరతాబాద్‌లో కదలికలు.. బైపోల్‌కు రంగం రెడీ!**

దానం నాగేందర్ అనర్హుడని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వస్తుందని కోర్టు స్పష్టం చేసింది. స్పీకర్ నిర్ణయం పక్కన పెట్టి అనర్హత పిటిషన్లను కొట్టివేసి గత ఉత్తర్వును హైకోర్టు రద్దు చేసింది. దీంతో ఖైరతాబాద్ సీటు ఖాళీ కాగా.. కొత్తగా ఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిటిషన్లు దాఖలు చేసినవారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు. దానం నాగేందర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచారు...

**2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు..**

"ఇంకా మిగిలినోళ్ల సంగతేంది?"..పొలిటికల్ హీట్

హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ తీర్పును స్వాగతించారు. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే పరిణామం వస్తుందని ఆయన సోషల్ మీడియా వేదికగా చెప్పుకొచ్చిండు. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి కూడా తీర్పుపై స్పందించిర్రు. ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఉన్న అనర్హత పిటిషన్లను చట్ట ప్రకారం పరిష్కరించాలని వారు డిమాండ్ చేసిర్రు. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా తీర్పును స్వాగతిస్తూ, ఇతర కేసులపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరిండు.

**ఇప్పుడు అసలు పిక్చర్ ఏంది?**

ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే సీటు ఖాళీ కావడంతో ఉపఎన్నిక తప్పనిసరి అయ్యే పరిస్థితి ఏర్పడింది. హైకోర్టు ఆదేశాల ప్రతిని అసెంబ్లీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. దానం నాగేందర్ తరఫు న్యాయవాది తీర్పును అప్పీల్ చేసేందుకు ఉత్తర్వులను నిలిపివేయాలని కోరగా, కోర్టు ఆ అభ్యర్థనను అంగీకరించలేదు. ఇక ఖైరతాబాద్ గల్లీల్లో ఒక్కటే ముచ్చట మొదలైంది.. బైపోల్ ఎప్పుడబ్బా అంటూ చర్చ మొదలైంది...



### కేసీఆర్ భూములపై సర్వే.. తేడాలుంటే నోటీసులే!

2 లో



### 'వెయ్యి కోట్లు ఇవ్వండి.. ఆస్తులన్నీ తీసుకోండి!

2 లో



### 51 వేల మందికి జాబ్ లెటర్లు.. మోదీ చేతుల మీదుగా 'రోజ్‌గార్' జల్వా!

2 లో



### 'మగాళ్లకూ పీరియడ్స్ రావాలె!'.. శ్రుతి హాట్

3 లో



## గ్రీన్‌ల్యాండ్స్ వద్ద గణనాథుడికి రెడ్డి సాబ్ ప్రత్యేక పూజలు.. !

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18:**

ప్రేమ్ నగర్ గ్రీన్‌ల్యాండ్స్ హోటల్ దగ్గరలోని గణేష్ మండపంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బీఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నరసింహ రెడ్డి, మోర శ్రీరాములు ముదిరాజ్, కె. రామారావు యాదవ్, సురేష్ గౌడ్, సునీల్, యశ్వంత్, కపిల, అంజనేయులు తదితరులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. అనంతరం అంబర్ పేట వాసులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ప్రజలంతా పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నాలు తొలగించి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు ప్రసాదించాలని గణపయ్యను ప్రార్థించినట్లు తెలిపారు.



## ఎర్రవల్లిలో 'ఎకరాల వేట'.. 325 నంబర్‌పై సర్కారు డేగకన్ను!

**ఫామ్‌హౌస్ చుట్టూ రెవెన్యూ సర్వే.. రికార్డులన్నీ జల్లెడ**

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెండో రోజు రెవెన్యూ సర్వే కొనసాగుతోంది. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూముల హద్దులు, పాత రైతుల పేర్లు, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ గ్రామాల సరిహద్దులను గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక వివరాలతో నివేదిక సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. అయితే భూములపై ఉన్న ఆరోపణలు ప్రస్తుతం విచారణలోనే ఉన్నాయి.



## మధుయాష్కీకి కొత్త బాధ్యత.. కాంగ్రెస్ నేతల 'ముబారక్'!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18:**

మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా నూతనంగా నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ యూనియన్ నాయకులు జి. రామన్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో మధుయాష్కీ గౌడ్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెంపపెట్టు.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 18**



: బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌ను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి స్వాగతించారు. పార్టీ మారినప్పుడు పదవికి రాజీనామా చేయకుండా మరో పార్టీతో నడవడం ప్రజాతీర్పుకు వ్యతిరేకమని ఆయన వ్యాఖ్యానించారు. 2024లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభకు పోటీ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించగా.. దానిపై హైకోర్టును ఆశ్రయించిన బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ నేపథ్యంలో తాజా తీర్పు వెలువడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫిరాయింపుల వ్యవహారంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. "పార్టీ మారితే పదవి వదిలి మళ్లీ జనాల తీర్పు కోరాలె" అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చాడు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/



## సెన్సెక్స్ డౌన్.. నిఫ్టీ అప్.. మార్కెట్‌లో మిక్స్‌డ్ మజా

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**



దేశీ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మిక్స్‌డ్‌గా క్లోజయ్యాయి. సెన్సెక్స్ 19.63 పాయింట్లు తగ్గి 74,294.96 వద్ద సెటిల్ కాగా.. నిఫ్టీ 75.80 పాయింట్లు ఎగబాకి 23,346.40 దగ్గర ముగిసింది. నిఫ్టీ 23,300 పైన క్లోజ్ కావడంతో మార్కెట్‌లో కొంత పాజిటివ్ సీన్ కనిపించింది. అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, భారతి ఎయిర్‌టెల్ షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. మిడ్‌క్యాప్ 1.24%, స్మాల్‌క్యాప్ 1.74% లాభపడ్డాయి. మెటల్, రియల్టీ, ఆయిల్–గ్యాస్, సిమెంట్, కెమికల్ స్టాక్స్‌లో జోష్ ఉండగా.. ఐటీ మాత్రం డల్ అయ్యింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, గ్లోబల్ బాండ్ ఈల్డ్స్ మార్పులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి.





## ‘వెయ్యి కోట్లు ఇవ్వండి.. ఆస్తులన్నీ తీసుకోండి!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఫార్ములా–ఈ కేసులో నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్.. బయట మీడియాతో ఫుల్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబానికి రూ.లక్ష కోట్ల ఆస్తులున్నాయన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ సవాల్ విసిరారు. “రూ.వెయ్యి కోట్లు ఇచ్చి మా ఆస్తులన్నీ తీసుకోండి.. మిగిలిన రూ.99 వేల కోట్లతో హామీలు అమలు చేయండి” అని అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే ఫార్ములా–ఈ రేస్ నిర్వహించామని చెప్పారు. కేసులకు భయపడేది లేదని, న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా ఫార్ములా–ఈ కేసు తదుపరి విచారణను ఏసీబీ కోర్టు అక్టోబర్ 30కి వాయిదా వేసింది.



## సర్వీస్ రివాల్వర్ పేలి.. ఆర్ఐ సతీశ్ మృతి!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**

నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విషాదం చోటుచేసుకుంది. విధులు ముగించుకుని తన సర్వీస్ రివాల్వర్‌ను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్. సతీశ్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిజాయతీగల అధికారిగా పేరున్న సతీశ్ మృతితో పోలీస్ శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సహచర అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



## కేసీఆర్ భూములపై సర్వే.. తేడాలుంటే నోటీసులే!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18**

:కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్వేలో వ్యత్యాసాలు తేలితే కేసీఆర్‌కు నోటీసులు ఇస్తామని చెప్పారు. 2004 అఫిడవిట్‌లో ఎకరం భూమి మాత్రమే చూపించి.. ఇప్పుడు వందల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయంటూ ప్రశ్నించారు. హరీశ్‌రావు వట్టినాగులపల్లి భూముల విషయంలో మాట మార్చుతున్నారని ఆరోపించారు. రంగనాయక్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోని 13 ఎకరాల భూమి విషయంలోనూ ఆరోపణలు చేశారు. ఆ భూమికి లాభం చేకూరేలా రూ.5.40 కోట్లతో రోడ్డు వేయించారని పేర్కొన్నారు. భూ వ్యవహారాల్లో తప్పు చేసిన అధికారులు ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## 2 లక్షల ఇండ్లు ఓకే.. ‘మిగతావి కూడా ఇవ్వండి’!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

హైదరాబాద్ మాదాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి పీఎంఏవై–జీ కింద 2 లక్షల ఇండ్లు కేటాయించినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. గతంలో గుర్తించిన 11,56,915 అర్హ గ్రామీణ కుటుంబాలకు మిగిలిన 9.56 లక్షల ఇండ్లు కూడా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో, వర్షాభావంతో వ్యవసాయ రంగంపై పడుతున్న ప్రభావాన్ని కేంద్ర మంత్రికి వివరించి సహకారం కోరారు. రైతులను ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి వైపు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, సన్నవడ్లకు రూ.500 బోనస్ విషయాలను వివరించారు. అలాగే 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటెబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

## రూ.2 వేల దాటితే యూపీఐ బంద్..? పెట్రోల్ పంపుల్లో ‘క్యాష్’ పంచాయితీ!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**




పెట్రోల్ పంపుల్లో కొత్త ఎండీఆర్ ఛార్జీపై డీలర్లు ఫుల్ ఫైర్ అవుతున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన ఇంధన కొనుగోలును యూపీఐ ద్వారా చెల్లిస్తే రూ.5 ఫ్లాట్ ఎండీఆర్ వర్తించనుంది. ఈ భారాన్ని తమపై వేయొద్దని, లేదంటే పెట్రోల్ పంపులకు మినహాయింపు ఇవ్వాలని డీలర్లు కేంద్రాన్ని కోరుతున్నారు. డిమాండ్ నెరవేరకపోతే రూ.2,000కు పైబడిన యూపీఐ పేమెంట్లు ఆపి క్యాష్‌కే పరిమితం చేస్తామని పలు రాష్ట్రాల డీలర్లు చెబుతున్నారు. లీటరుకు తమకు రూ2.40––రూ3.40 మాత్రమే కమీషన్ వస్తుందని, రూ.5 ఛార్జీతో మార్జిన్‌పై ప్రభావం పడుతుందని అంటున్నారు. అయితే ఎండీఆర్ వ్యాపారులకే వర్తిస్తుందని, కస్టమర్లపై భారం వేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## 51 వేల మందికి జాబ్ లెటర్లు.. మోదీ చేతుల మీదుగా ‘రోజ్‌గార్’ జల్వా!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**



నిరుద్యోగ యువతకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. శనివారం జరిగే 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి పైగా కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయనున్నారు. 19న మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమం జరగనుంది. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఒకేసారి రోజ్‌గార్ మేళా నిర్వహించనున్నారు. రెవెన్యూ, రైల్వే, హోం, ఆరోగ్య––కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కనున్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు దేశ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమే లక్ష్యమని కేంద్రం తెలిపింది. ఈ మేళా పూర్తయ్యే నాటికి సుమారు 12.75 లక్షల మందికి నియామక పత్రాలు అందినట్లు అవుతుందని ప్రభుత్వం పేర్కొంది.

## ఇరాన్‌పై అమెరికాకు రష్యా––చైనా షాక్.. ఐరాసలో ‘వీటో’ జల్వా!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18**



: పశ్చిమాసియా టెన్షన్ వేళ ఐరాసలో ఇరాన్ అంశం మరోసారి హీట్ పెంచింది. ఇరాన్‌పై ఆంక్షల అమలును పర్యవేక్షించే నిపుణుల ప్యానెల్ గడువును మరో ఏడాది పొడిగించాలన్న అమెరికా ప్రతిపాదనకు రష్యా, చైనాలు వీటో వేశాయి. గురువారం జరిగిన ఓటింగ్‌లో తీర్మానానికి 11 దేశాలు అనుకూలంగా ఓటేయగా, రష్యా––చైనా వ్యతిరేకించాయి. పాకిస్థాన్, సోమాలియా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. దీంతో నిపుణుల ప్యానెల్ ప్రస్తుత మాండేట్ కొనసాగించే ప్రతిపాదన ఆమోదం పొందలేదు. ఇరాన్‌పై ఐరాస ఆంక్షల వ్యవస్థ, 2015 అణు ఒప్పందం, ‘స్నాప్‌బ్యాక్’ ప్రక్రియపై అమెరికా, పాశ్చాత్య దేశాలు ఒక వైపు.. రష్యా, చైనాలు మరో వైపు నిలవడంతో దౌత్య పోరు మరింత ముదిరింది.

## నందిగ్రామ్‌లో వరుస ట్విస్టులు.. దీదీ వర్గం ‘సీన్’ రివర్స్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18**



: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో నందిగ్రామ్ ఉప ఎన్నిక కొత్త ట్విస్టులు తీసుకొస్తోంది. మమతా బెనర్జీ వర్గం అభ్యర్థి సంచితా ప్రధాన్ డే శుక్రవారం నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఆ వర్గం బరిలో అభ్యర్థి లేకుండా పోయింది. ఈ పరిణామం తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ఇస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు. తమ వర్గం నుంచి మరో అభ్యర్థిని నిలబెట్టబోమని స్పష్టం చేశారు. ఇది ప్రతిపక్ష ఐక్యత, ఇండియా కూటమి సంఘీభావంలో భాగమని మమతా పేర్కొన్నారు. ఇదే సమయంలో టీఎంసీ అంతర్గత విభేదాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అసలు పార్టీ పేరు, గుర్తును ఫ్రీజ్ చేసి.. మమతా వర్గానికి ‘ఫుట్‌బాల్ ప్లేయర్’, మరో వర్గానికి ‘ఎన్వలప్’ గుర్తులు కేటాయించింది.



## ఇందిరమ్మ ఇళ్ల డ్రాలో ‘గోల్‌మాల్’.. దానం ఫుల్ ఫైర్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

తెలంగాణ అసెంబ్లీ జీరో అవర్‌లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫుల్ ఫైర్ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ పాటించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లలో ఇతర నియోజకవర్గాల వారికి ఇళ్లు ఎలా వచ్చాయంటూ ప్రశ్నించారు. 360 డిగ్రీల స్క్రూటినీ చేశామని అధికారులు చెబుతున్నప్పుడు తప్పిదాలు ఎలా జరిగాయని నిలదీశారు. పొరపాట్లు జరిగితే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలందరికీ సమాన గౌరవం ఉండాలని, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారమే ఇళ్లు కేటాయించాలని కోరారు. ఇక తన అనర్హత పిటిషన్‌పై తీర్పు నేపథ్యంలో రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో తనకూ తెలియదంటూ దానం చేసిన వ్యాఖ్యలు కూడా సభలో చర్చనీయాంశమయ్యాయి.

## ఆకాశంలో ‘దేశీ’ జల్వా.. ఐఏఎఫ్ అమ్ములపొదిలో కొత్త విమానాలు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**



భారత వైమానిక దళం అమ్ములపొదిలోకి స్వదేశీ టెక్నాలజీతో తయారైన శక్తిమంతమైన విమానాలు, హెలికాప్టర్లు చేరనున్నాయి. రెండు ఎల్‌సీఏ తేజస్ ఎఫ్ఓసీ ట్విన్ సీటర్ ట్రైనర్లు, హెచ్‌టీటీ–40 బేసిక్ ట్రైనర్ విమానాలు ఐఏఎఫ్‌కు అందనున్నాయి. అలాగే పవన్ హన్స్ లిమిటెడ్‌కు నాలుగు ధ్రువ్ ఎన్‌జీ హెలికాప్టర్లు అప్పగించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెంగళూరు, కొచ్చి పర్యటిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో స్వదేశీ విమానాలు, హెలికాప్టర్లను సంబంధిత సంస్థలకు అప్పగించారు. కాగా...దేశీయ రక్షణ ఉత్పత్తులకు ఈ కార్యక్రమం మరింత ఊతమిస్తుందని రక్షణ రంగం పేర్కొంది.

## డెంగ్యూ దోమకు టీకా దెబ్బ.. ‘క్యూడెంగా’తో గుడ్‌న్యూస్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**




డెంగ్యూ నివారణలో భారత్‌కు కీలక ముందడుగు.. దేశంలో తొలిసారిగా ఆమోదం పొందిన డెంగ్యూ వ్యాక్సిన్ ‘క్యూడెంగా’ 2027 తొలినాళ్లలో భారత మార్కెట్లోకి రానుంది. జపాన్‌కు చెందిన తకేడా ఫార్మాస్యూటికల్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ మధ్య కుదిరిన ఒప్పందంతో ప్రైవేట్ మార్కెట్‌లో పిల్లలు, పెద్దలకు వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. 4 నుంచి 60 ఏళ్ల వయసువారికి ఈ టీకా ఇవ్వడానికి అనుమతి లభించింది. టాఖ–003గా పిలిచే ఈ లైవ్–అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్ డెంగ్యూ వైరస్ నాలుగు సెరోటైప్‌లపై పనిచేస్తుంది. మూడు నెలల వ్యవధిలో రెండు డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ సార్వత్రిక టీకా కార్యక్రమంలోనూ చేర్చడమే తమ లక్ష్యమని తకేడా తెలిపింది.

ట్రెండింగ్, క్రైం

ఇయ్యాలి NEWS
Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

# రీఎంట్రీ ఇచ్చిన చరణ్.. ఛాలెంజ్‌లో త్రిగుణ్ జల్వా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

బిగ్‌బాస్ తెలుగు హౌస్‌లో రోజుకో కొత్త ట్విస్ట్‌తో మజా డబుల్ అవుతోంది. ఫస్ట్ వీక్‌లోనే ఎలిమినేట్ అయిన ఆర్జే చరణ్.. 11వ రోజున హౌస్‌లోకి రీఎంట్రీ ఇచ్చి అందరికీ షాక్ ఇచ్చాడు. వచ్చీరావడంతోనే గేమ్‌లో అసలు సీన్ చూపిస్తానంటూ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో బరిలో దిగాడు. చరణ్‌కు బిగ్‌బాస్ రెండు ఆప్షన్లు ఇచ్చుగా.. కెప్టెన్సీ కంటెండర్‌తో డైరెక్ట్ చాలెంజ్‌ను ఎంచుకున్నాడు. దీంతో త్రిగుణ్‌తో హోరాహోరీ పోరు జరిగింది. హౌస్‌మేట్స్ నజర్ అంతా ఈ టఫ్ ఫైట్‌పైనే. చివరికి త్రిగుణ్ విజేతగా నిలిచి తన కంటెండర్ స్థానాన్ని కాపాడుకున్నాడు. చరణ్ ఛాలెంజ్ ఫెయిల్ అయినా.. ముందుముందు గేమ్‌లో ఏ రచ్చ చేస్తాడోనని ఆడియన్స్‌లో ఇంట్రెస్ట్ పెరిగింది.







## చీరలో నందితా .. ఫ్యాన్స్ దిల్ ఖుష్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

నటి నందితా శ్వేత చీరలో మెరిసిన లేటెస్ట్ లుక్ అభిమానులను ఫిదా చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన ఆకర్షణీయమైన ఫోటోలో సంప్రదాయ అందం, మోడ్రన్ స్టైల్ కలగలిసి అదరగొట్టాయి. చీరలో నందితా ఇచ్చిన ఎలిగెంట్ పోజులు నెటిజన్ల నజర్‌ను కట్టిపడేశాయి. ఆమె నిత్యనూతన అందానికి ఫ్యాన్స్ ఫుల్ మార్కులు వేస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## లాంజ్‌లో దీక్షా . స్టైల్‌కు ఫిదా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

సొగసైన లాంజ్ లుక్‌లో దీక్షా సింగ్ అదరగొట్టారు. హుందాతనం, మోడ్రన్ స్టైల్ రెండింటినీ మిక్స్ చేస్తూ ఆమె కనిపించిన తీరు చూపరులను అట్రాక్ట్ చేసింది. కాంటెంపరరీ ఫ్యాషన్‌తో దీక్షా ఇచ్చిన ఎలిగెంట్ పోజులు నెటిజన్ల నజర్‌ను కట్టిపడేశాయి. సింపుల్ లుక్‌లోనూ తనదైన స్టైల్ చూపిస్తూ దీక్షా సింగ్ మరోసారి ఫ్యాషన్ ఫీవర్ పెంచేశారు.



### పిఠాపురంలో లవ్ స్టార్ట్..

## నాన్నల దిల్ బ్రేక్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

రాజేంద్రప్రసాద్ హీరోగా వచ్చిన 'పిఠాపురంలో అలా మొదలైంది' ఫ్యామిలీ డ్రామా ఆడియన్స్‌ను ఆలోచింపజేస్తుంది. యుక్త వయసులో ఆకర్షణను ప్రేమగా భావించి అమ్మాయిలు తీసుకునే తొందరపాటు నిర్ణయాలు, వాటితో తల్లిదండ్రులు పడే వేదన చుట్టూ కథ తిరుగుతుంది. ఫస్ట్ హాఫ్‌లో కాలేజీ, లవ్ ట్రాక్స్ కాస్త రొటీన్‌గా అనిపించినా.. ఇద్దరు అమ్మాయిలు ఇల్లు వదిలి వెళ్లిన తర్వాత అసలు ఎమోషన్ మొదలవుతుంది. కూతుళ్ల భవిష్యత్తు కోసం తండ్రులు పడే తపనను రాజేంద్రప్రసాద్ తన అనుభవంతో పండించారు. రిహానా, శ్రీలు, ప్రత్యూష తమ పాత్రల్లో ఆకట్టుకున్నారు. సెకండాఫ్‌లో భావోద్వేగాలు బాగానే పండాయి. స్క్రీన్‌ప్లే కాస్త స్లో అయినా.. మంచి మెసేజ్‌తో సినిమా ఓసారి చూడొచ్చనిపిస్తుంది.





## మేఘన మిస్సింగ్.. మిస్టరీ మైండ్ బ్లోయింగ్?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

కూతురు మిస్సింగ్‌తో మొదలయ్యే 'మిస్సింగ్ మేఘన' సినిమా.. మెల్లగా క్రైమ్ మిస్టరీగా టర్న్ తీసుకుంటుంది. అమ్ము అభిరామి టైటిల్ రోల్‌లో ఆకట్టుకోగా.. రామ్ కార్తీక్, కౌశిక్ తమ క్యారెక్టర్లలో మంచి ఇంపాక్ట్ చూపించారు. ఫస్ట్ హాఫ్ కాస్త స్లోగా నడిచినా.. ఇంటర్వెల్ బ్యాంగ్ దగ్గర సీన్ ఒక్కసారిగా హీట్ ఎక్కుతుంది. సెకండాఫ్‌లో మిస్సింగ్ కేసు వెనకున్న లింకులు, ఇన్వెస్టిగేషన్, ట్విస్టులు ఆడియన్స్‌ను ఎంగేజ్ చేస్తాయి. అయితే కొన్ని ట్విస్టులు ముందే ఊహించేయొచ్చు.. విలన్ రివీల్‌లో కూడా పెద్ద సర్‌ప్రైజ్ కనిపించదు. క్లైమాక్స్ కూడా కాస్త రొటీన్‌గానే అనిపిస్తుంది. శ్యామ్ కే నాయుడు కెమెరా వర్క్, నటీనటుల పెర్ఫార్మెన్స్ ప్లస్. క్రైమ్ థ్రిల్లర్ లవర్స్‌కు ఓ మోస్తరు టైంపాస్.




## 19 గంటలు టాయిలెట్‌లోనే భర్త.. చివరికి విషాదం!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18:**

అమెరికాలోని వెస్ట్ వర్జీనియాలో షాకింగ్ ఘటన వెలుగులోకొచ్చింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న 76 ఏళ్ల భర్తను 19 గంటల పాటు టాయిలెట్‌పైనే వదిలేసినట్లు 75 ఏళ్ల మార్గరెట్ రోగ్‌పై ఆరోపణలు వచ్చాయి. భర్తకు సాయం అవసరమని తెలిసినా.. కావాలనే పట్టించుకోలేదని దర్యాప్తులో ఆమె చేసిన వ్యాఖ్యలు కోర్టు పత్రాల్లో నమోదయ్యాయి. మరుసటి రోజు స్పీచ్ థెరపిస్ట్ గమనించి ఆస్పత్రికి తరలించగా.. పలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పది రోజుల తర్వాత ఆయన మృతి చెందారు.?

నిర్లక్ష్యం, వృద్ధుడిపై వేధింపుల ఆరోపణలతో రోగ్‌పై కేసు నమోదైంది. ప్రస్తుతం ఆమె నార్త్ సెంట్రల్ రీజినల్ జైలులో ఉండగా.. కోర్టు 75 వేల డాలర్ల బెయిల్ బాండ్ నిర్ణయించింది.

## 'మగాళ్లకూ పీరియడ్స్ రావాలె!'.. శ్రుతి హాట్ కామెంట్స్

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**



"మగవాళ్లకూ పీరియడ్స్ వస్తే బాగుండు.. అప్పుడైనా కాంట్రాక్టుల్లో 'పీరియడ్స్ లీవ్స్' రాసేవారు" అంటూ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ చర్చనీయాంశమయ్యాయి. సోహా అలీ ఖాన్ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడిన శ్రుతి.. తాను పీసీఓఎస్‌తో ఇబ్బంది పడుతున్నానని, పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పి ఉంటుందని చెప్పింది. కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్స్‌లో తన బాధను చెప్పుకోవడానికి ఇబ్బంది పడ్డానని తెలిపింది. అయితే ఓ దర్శకుడితో తన సమస్యను షేర్ చేసుకున్న తర్వాత పరిస్థితి మారిందని, సెట్‌లో వాతావరణం మరింత అర్థం చేసుకునేలా మారిందని వెల్లడించింది. మహిళల ఆరోగ్య సమస్యలపై బహిరంగంగా మాట్లాడాల్సిన అవసరం ఉందంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి.




## హరిబాబు హత్య.. సంతోష్ సెల్ఫీ వీడియోతో ట్విస్ట్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 18**

: నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త చిత్తరి హరిబాబు(26) హత్య కేసు కొత్త మలుపు తిరిగింది. వైష్ణవి సోదరుడు సంతోష్ తానే హరిబాబును హత్య చేసినట్లు సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ.. పోలీసుల ముందు లొంగిపోతానని చెప్పాడు. గురువారం రాజరాజేంద్ర చౌరస్తా వద్ద మక్కబుట్టలు అమ్ముతున్న హరిబాబుపై కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసినట్లు సీసీ కెమెరా దృశ్యాలు నమోదయ్యాయి. పదునైన ఆయుధంతో తలపై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో వైష్ణవి హత్య కేసులో హరిబాబు అరెస్టై బెయిల్‌పై బయటకొచ్చాడు. తాజాగా అతడే హత్యకు గురికావడంతో కేసు మరింత మిస్టరీగా మారింది. సంతోష్ వీడియోపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



## మోనోక్రోమ్‌లో దివ్య .. లుక్‌కు ఫిదా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 18:**

బోల్డ్ అవంట్-గార్డ్ మోనోక్రోమ్ లుక్‌లో దివ్య భారతి అదరగొట్టింది. చక్కటి టైలరింగ్‌తో రెడీ అయిన ఆమె అవుట్‌ఫిట్‌కి, విగ్రహంలాంటి కాన్ఫిడెన్స్ తోడై చూపరులను అట్రాక్ట్ చేసింది. మోడ్రన్ రాయల్ ఛార్మ్‌తో దివ్య ఇచ్చిన స్టైలిష్ పోజులు సోషల్ మీడియాలో నజర్ తిప్పుకోనివ్వకుండా చేస్తున్నాయి. సింపుల్‌గా ఉన్నా స్టైల్‌లో మాత్రం ఫుల్ ఝలక్ చూపిస్తూ దివ్య తన ఫ్యాషన్ సెన్స్‌తో ఫిదా చేసేస్తోంది.

ON BEHALFOF RRR MEDIA PVT LIMITED ..2-3-606/49/4.. PATELNAGER.. AMBER PET, HYDERABAD, TELNGANA.. 500013,
EDITOR: RAMANRAJU RATHNA, RNI NO TG/2024/1093.. email:ramannews9@gmail.com..phon 9949152838, 7013794396